ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



కుప్పానికి కృష్ణా జలాలను తీసుకువచ్చింది జగనే అంటూ సీఎం జగన్‌రెడ్డి సోమవారం కుప్పంలో చేసిన బటన్‌నొక్కుడు హడావుడి ఉత్తిదే అని రెండో రోజుకే తేలిపోయింది. నీళ్లు పారని కాలువను చూసి ఇంత మోసమా అని జనం ఆశ్చర్యపోతున్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే అబద్ధాలను కుప్పం బహిరంగ సభా వేదికమీద నుంచి జగన్ ధాటీగా వల్లించారని అంటున్నారు. హంద్రీనీవా ప్రారంభమయ్యే శ్రీశైలం మాల్యాలలో నీళ్లు లేక చాన్నాళ్ల కిందటే పంపింగ్ ఆగిపోయింది. చిత్తూరు జిల్లాకు నీళ్లిచ్చే చెర్లోపల్లె రిజయర్వాయర్‌లోనూ ప్రస్తుతం సరిపడా నీళ్లు లేవు. అయినా జగన్‌ను మెప్పించడానికి, జనాన్ని నమ్మించడానికి అధికారులు అతికష్టమ్మీద రామకుప్పానికి నీళ్లను తెచ్చారు. ఇక్కడి దాకా తెచ్చిన నీళ్లు జగన్ చెప్పినట్టు కుప్పం నియోజకవర్గంలో 54 చెరువులను నింపే అవకాశం దరిదాపుల్లోనే లేదు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

జలమాయావి



రాజుపేటవద్ద ప్రారంభోత్సవ సమయంలో ఐదున్నర నుంచి ఆరు అడుగులున్న నీళ్లు.. రెండో రోజైన మంగళవారానికే రెండు నుంచి రెండున్నర అడుగులకు చేరింది.


కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లు రెండు రోజులే!

- శ్రీశైలం మాల్యాలలో ఆగిపోయిన పంపింగ్
- చెర్లోపల్లి రిజర్వాయర్‌లో ఉన్న నీళ్లు 0.18 టీఎంసీనే

కుప్పానికి నీళ్లు వచ్చే దారి ఇదీ..

కర్నూలు జిల్లా శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు (బ్యాక్ వాటర్) హంద్రీనీవా మీదుగా కుప్పం వరకు రావాల్సి ఉంది. ఈ నీళ్ల రాయలసీమలోని అన్ని జిల్లాలకు వెళ్లేలా రూపకల్పన చేశారు. శ్రీశైలం మాల్యాల నుంచి జీడీపల్లి రిజర్వాయర్ మీదుగా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ వరకు నీళ్ల వస్తాయి. పుంగనూరు బ్రాంచి కెనాల్ మీద నిర్మించిన చెర్లోపల్లి రిజర్వాయర్ చిత్తూరు ఉమ్మడి జిల్లాకు నీళ్లను ఇస్తుంది. శ్రీశైలం రిజర్వాయర్ కెపాసిటీ 885 అడుగులు. ప్రస్తుతం 814 అడుగులకు పడిపోయింది. 830 అడుగుల మట్టం ఉంటేనే హంద్రీనీవా కెనాల్‌లోకి నీళ్లను పంపింగ్ చేస్తారు. దీంతో ఈ నెల 25న పంపింగ్ ఆగిపోయింది. ఇక మాల్యాల నుంచి నేరుగా, జీడిపల్లికు, అక్కడి నుంచి చెర్లోపల్లె రిజర్వాయర్‌కు నీళ్ల వస్తాయి. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్‌లో 0.50 టీఎంసీ, చెర్లోపల్లిలో 0.18 టీఎంసీ నీళ్ల మాత్రమే ఉన్నాయి. జీడిపల్లికు 280 క్యూసెక్కుల నీళ్ల వస్తుండగా, 265 క్యూసెక్కులను కిందికి వదులుతున్నారు. పైన పంపింగ్ లేకపోవడంతో ఇవి కూడా రెండు రోజుల్లో ఆగిపోతాయి. 1.6 టీఎంసీ కెపాసిటీ ఉన్న చెర్లోపల్లి రిజయర్వాయర్‌లో ఇప్పుడు 0.18 టీఎంసీ మాత్రమే నీళ్లున్నాయి. చెర్లోపల్లిలో 80 క్యూసెక్కుల నీళ్లను పుంగనూరు బ్రాంచి కెనాల్‌లోకి వదిలితే అది కుప్పం బ్రాంచి కెనాల్ మీదుగా రామకుప్పం వరకు చేరే సరికి 30-40 క్యూసెక్కులు మాత్రమే ఉంటుంది. ఇంజనీరింగ్ లెక్కల ప్రకారం 15 శాతం పారుదల నష్టం ఉంటుంది. మరో 15 శాతం నీళ్ల ఆవిరి అయిపోతాయి. సీఎం ప్రారంభోత్సవం కోసం చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి నీళ్లను తాత్కాలికంగా వదిలారు. అక్కడ నీళ్ల లేకపోవడంతో ఇక పంపింగ్ ఆపేస్తారు. అందులోనూ చిత్తూరు ఉమ్మడి జిల్లాకు నీళ్లిచ్చే ఈ చెర్లోపల్లి రిజర్వాయర్ పరిధిలో కదిరి, నల్లచెరువు ప్రాంతాల్లోని 5500 ఎకరాల ఆయకట్టు కూడా ఉంది. ఉన్న ఆ కాస్త, 0.18 టీఎంసీ నీళ్లను కూడా వదిలిస్తే ఇబ్బంది అని అక్కడి రైతులు కూడా అడ్డుకునే అవకాశాలున్నాయి. గతంలో ఇలాంటి ఘటనలు జరిగాయి. అంటే ఎన్నికలవేళ మాయ చేయడానికే జగన్ కుప్పంలో కృష్ణాజలాల విడుదల అంటూ హంగామా చేశారని అర్థం అవుతోంది.

'పాలారు' చిచ్చు



కుప్పం మండలం పెద్దవంక గ్రామ సమీపంలో పాలారు నది (ఫైల్ ఫొటో)

- ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులిచ్చేశామన్న జగన్
- ఆగ్రహిస్తున్న తమిళనాడు ప్రభుత్వం
- ఇరు రాష్ట్రాల మధ్య మళ్లీ రాజుకున్న వివాదం

కుప్పం, ఫిబ్రవరి 27: 'పాలారు ప్రాజెక్టుకు సంబంధించి 0.6 టీఎంసీల సామర్థ్యంతో చిన్నపాటి రిజర్వాయర్‌ను రూ.215 కోట్లతో నిర్మించడానికి పరిపాలనా అనుమతులిచ్చాం' అని కుప్పం నియోజకవర్గ పర్యటనలో సోమవారం సీఎం జగన్ ప్రకటన చేశారు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం భగ్గుమంది. అక్కడి రైతులు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగా ఎన్నికలే లక్ష్యంగా తొందరపాటుతో సీఎం చేసిన ప్రకటన పక్క రాష్ట్రంతో నెమ్మదించిన వివాదాన్ని తిరిగి రాజుకునేలా చేసింది. జగన్ చేసిన ప్రకటనను తప్పుపడుతూ ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దురై మురుగన్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మూడు చెక్‌డ్యాంలు నిర్మించేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం గర్హనీయమని పేర్కొన్నారు. పాలారు బహుళ ప్రాజెక్టుల నది అని పేర్కొన్న ఆయన.. ఇది 1892, మద్రాసు-మైసూరు ఒప్పందంలో పేర్కొన్న అంతర్రాష్ట్ర నదులలో ఒకటన్నారు. 1892 నాటి ఆఫ్ స్ట్రీమ్ స్టేట్స్ అగ్రిమెంట్ ప్రకారం దిగువ రాష్ట్రాల ముందస్తు అనుమతి లేకుండా అంతర్రాష్ట్ర నదులపై డ్యామ్‌ల నిర్మాణం లేదా నీటిని మళ్లించడానికి లేదా నిల్వ చేయడానికి ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. సీఎం జగన్ ప్రకటనను తమిళనాడు ప్రభుత్వం ఖండించడంతోపాటు వెల్లూరు జిల్లా రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.కేవలం ఎన్నికలే లక్ష్యంగా పాలారు ప్రాజెక్టుపై దుందుడుకుగా సీఎం చేసిన ప్రకటన ఇప్పుడు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టింది.

వైఎస్‌తో మొదలు

పాలారు ప్రాజెక్టు నిర్మిస్తామంటూ 2007లో అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి కుప్పం మండలం గణేశ్‌పురం వద్ద శిలాఫలకం వేశారు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసు వేసింది. కేసు నడుస్తుండటంతో.. ఆ తర్వాత ప్రభుత్వాలేవీ దీనిపై ప్రకటనలు చేయలేదు. దీనికి విరుద్ధంగా సాంకేతిక అంశాలను, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోకుండా పాలారు ప్రాజెక్టుపై రిజర్వాయర్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చామంటూ సీఎం జగన్ ప్రకటించడం తమిళనాడుతో వైరాన్ని మూటగట్టుకోవడానికి దోహదం చేసేలా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం నెల రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ప్రయోజనాలకు అనుగుణంగానే సీఎం ఈ ప్రకటన చేశారన్న ఆరోపణలు లేకపోలేదు. పాలారు నదిపై ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు వెళ్లిన విషయం సీఎంకు తెలియకుండా ఎలా ఉంటుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా ఈ విషయం పట్టించుకోకుండా ప్రాజెక్ట్ నిర్మిస్తామని పదేపదే చెప్పడం గమనార్హం.

సచివాలయాల్లో సర్దుపోటు

- ఇప్పటికే 1656 మంది కొరత
- మరింత తగ్గించేందుకు కసరత్తు

జగన్ ప్రభుత్వం దృష్టి తాజాగా సచివాలయాల మీద పడింది. రేషనలైజేషన్ పేరుతో సచివాలయాల్లో సిబ్బంది సంఖ్యను తగ్గించబోతున్నారు. జగన్ మానసపుత్రిక అని చెప్పుకొనే సచివాలయంలో 11 మంది ఉండాలి. ఇప్పుడు, ఒక్కో సచివాలయంలో 8 మందిని ఉంచి మిగిలిన ముగ్గురిని సర్దుబాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఎన్నికలు వస్తున్న సమయంలో ఇదేమి పోటు అంటూ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం 612 సచివాలయాలు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 108, గ్రామీణ ప్రాంతాల్లో 504 ఉన్నాయి. ఈ సచివాలయాల్లో 20 రకాల విభాగాల్లో 6636 పోస్టులుండగా, 4980 మంది మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నారు. 1656 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంకా మెటర్నటీ, మెడికల్ తదితర కారణాలతో రోజుకు 200 మంది వరకు సెలవుల్లో ఉంటున్నారు. పనిచేస్తున్న 4980 మందే 6636 మందికి సంబంధించిన పనులను నెలల తరబడి అదనంగా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో 8 మంది ఉంటే చాలు అంటూ సిబ్బందిని మరింత కుదించే కార్యక్రమం చేపడుతున్నారు. ఇందువల్ల గ్రామాల్లో సేవలు కొరవడే అవకాశం ఉంది. ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే బదిలీలు చేస్తోందనే ప్రచారం జరుగుతోంది. కాగా, అనుకూలమైన వారిని కావాల్సిన చోటకు నియమించుకోవడానికి ఇప్పటికే వైసీపీ నేతలు రంగంలోకి దిగారు.

- చిత్తూరు కలెక్టరేట్





1 నుంచి రేషన్‌లో రాగిపిండి

- కిలో 11 రూపాయలు
- అదీ కొందరికే
- ఆగిన కందిపప్పు పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27: తెల్లరేషన్ కార్డుదారులకు ఇప్పటివరకు రాగులు ఉచితంగా ఇచ్చేవారు. దీనిని మార్చినుంచి రాగిపిండిగా మార్చి కిలో ప్యాకెట్లలో నగదుకు ఇవ్వనున్నారు. కిలో ధర రూ.11గా అధికారులు ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా 5.45 లక్షల బియ్యం కార్డులు ఉన్నాయి. కేంద్రప్రభుత్వం రేషన్ బియ్యాన్ని ఉచితంగా ఇస్తోంది. ఈ బియ్యంలో 1-3 కిలోలు తగ్గించుకుని రాగులను గతేడాది నవంబరు నెల వరకు ఉచితంగా పంపిణీ చేశారు. డిసెంబరు నుంచి వీటి పంపిణీ ఆగింది. రాగులు నాశిరకంగా ఉన్నాయని, వినియోగానికి పనికిరావంటూ కార్డుదారులు తీసుకునేందుకు ఇష్టపడలేదు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 3500 టన్నుల రాగులను జనవరిలో ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. మార్చి ఒకటో తేది నుంచి రేషన్‌లో రాగిపిండిని కిలో ప్యాకెట్ రూపంలో కార్డుదారులకు నగదుకు పంపిణీ చేస్తారు. ఒక్కో కార్డుదారుకు కిలో వంతున జిల్లాకు 545 టన్నుల రాగిపిండి అవసరం. ప్రభుత్వం 250 టన్నులు మాత్రమే కేటాయించింది. దీంతో సుమారు 3లక్షల కార్డుదారులకు రాగిపిండి అందే అవకాశం లేదు. ఇక, గోధుమ పిండి కూడా 545 టన్నులు అవసరం కాగా.. ప్రభుత్వం 150 టన్నులే కేటాయించింది. దీంతో నాలుగు లక్షల మంది కార్డుదారులకు అందే అవకాశం లేదు. ఇక, కందిపప్పు పంపిణీ మూడు నెలలుగా నిలిచిపోయింది.

ప్రశాంతంగా తొలి రోజు టెట్

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 27: జిల్లాలో తొలి రోజైన మంగళవారం టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) ప్రశాంతంగా జరిగింది. చిత్తూరు ఎస్వీసెట్, పూతలపట్టులోని వేము, పలమనేరులోని మదర్ థెరిసా కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 404 మందికి గాను 353 మంది హాజరు కాగా, 51 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 411 మందికి గాను 364 మంది అభ్యర్థులు హాజరు కాగా, 47 మంది గైర్హాజరయ్యారు.

ఇంటర్ ప్రశ్నపత్రాల తరలింపు

జిల్లాకు మూడు విడతలుగా చేరిన ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తు మధ్య మంగళవారం ఆయా పోలీసు స్టేషన్లకు తరలించినట్లు జిల్లా పరిశీలకుడు దుర్గాప్రసాద్ తెలిపారు. డీవీఈవో సయ్యద్ మౌలతో కలిసి పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భద్రపరచిన ప్రశ్నపత్రాలను పరిశీలించారు. మూడు సెట్లలో వచ్చిన ప్రశ్నపత్రాలను 50 సెంటర్లకు సంబంధించి 25 పోలీసు స్టేషన్లకు పంపారు. డిస్ట్రిక్ బల్క్ ఇన్‌చార్జి అబ్దుల్ మజీద్, జిల్లా పరీక్షల కమిటీ సభ్యుడు దయానందరాజు తదితరులు పాల్గొన్నారు.

కక్షకట్టి.. నకిలీ హాల్ టికెట్ సృష్టించి..!

- గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల్లో పట్టించాలని పన్నాగం
- తీరా హాల్ టికెట్ నకిలీదిగా తెలిసి ఫిర్యాదు
- అసలు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- కర్నూలులో కుట్ర.. చిత్తూరులో వెలుగుచూసిన వైనం



మీడియా సమావేశంలో నిందితుడిని చూపిస్తున్న ఏఎస్పీ అరీఫుల్లా

చిత్తూరు, ఫిబ్రవరి 27: వారిద్దరూ బంధువులే. కానీ, రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలున్నాయి. దీనిని మనసులో పెట్టుకున్నాడు. గ్రూపు-2 ప్రిలిమినరీ స్ర్కీనింగ్ పరీక్షల్లో నకిలీ హాల్ టికెట్‌ను సృష్టించి ఇచ్చి.. పోలీసులకు పట్టించాలని పథకం పన్నాడు. తీరా అతడే నిందితుడిగా దొరికిపోయాడు. కర్నూలు జిల్లాలో మొదలైన ఈ కుట్ర.. చిత్తూరులో బయటపడింది. ఈ వివరాలను మంగళవారం చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఒకటో పట్టణ సీఐ విశ్వనాథరెడ్డితో కలిసి ఏఎస్పీ అరీఫుల్లా మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం కంబాలపాడుకు చెందిన సుదర్శనం ఏపీపీఎస్సీ గ్రూపు-2 ప్రిలిమినరీ స్ర్కీనింగ్ పరీక్ష రాయాలని భావించారు. దీనికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని తన బంధువైన, కర్నూలు జిల్లా డోన్ నగరం రాజా కాంప్లెక్స్‌లోని మీ సేవా కేంద్రంలో పనిచేస్తున్న ఇమ్మానుయేలును అడిగారు. గతంలో తమ రెండు కుటుంబాల మధ్య ఉన్న వైషమ్యాలను మనసులో పెట్టుకుని ఇమ్మానుయేలు దరఖాస్తు చేయకుండా మోసం చేయాలని నిర్ణయించుకున్నాడు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. హాల్ టికెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. తనకు హాల్‌టికెట్ తీసివ్వాలని సుదర్శనం అడిగారు. అదే మీ సేవా కేంద్రంలో మండ్ల శ్రీనివాసులు అనే అభ్యర్థి ఒరిజనల్ హాల్ టికెట్ పీడీఎఫ్ ఉంది. దీనిని పీడీఎఫ్ కన్వర్షన్ అప్లికేషన్ ద్వారా ఎంఎస్ వర్డ్ అప్లికేషన్‌లోకి ఇమ్మానుయేలు మార్చాడు. సుదర్శనం వ్యక్తిగత వివరాలు, ఫొటోను మండ్ల శ్రీనివాసులు హాల్ టికెట్‌లో ఎడిట్ చేసి నకిలీ హాల్ టికెట్‌ను తయారు చేసిచ్చాడు. పరీక్షా కేంద్రాన్ని దూరంగా పెడితే వెళ్లడానికి సమయం చాలక... పరీక్ష రాయకుండా వచ్చేస్తాడని అనుకున్నాడు. అందుకని చిత్తూరు నగరం మర్రిమాను వీధిలోని నారాయణ కాలేజీని పరీక్షా కేంద్రంగా నకిలీ హాల్‌టికెట్‌లో చూపించాడు. ఒకవేళ సకాలంలో పరీక్షకు వెళితే నకిలీ హాల్ టికెట్ కావడంతో పోలీసులకు పట్టుబడతాడని, అప్పుడు తన పంతం నెరవేరుతుందని భావించాడు. ఇదేమి తెలియని సుదర్శనం ఆ హాల్ టికెట్‌తో ఈనెల 25వ తేదీన జరిగిన గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షకోసం చిత్తూరుకు చేరుకున్నారు. ఆ హాల్ టికెట్‌లో చూపిన నారాయణ కాలేజీని ప్రభుత్వం పరీక్షా కేంద్రంగా ఎంపిక చేయలేదని తెలిసింది. దీంతో చిత్తూరులోని అధికారులను ఆయన కలిసి హాల్ టికెట్ చూపగా.. నకిలీదని గుర్తించారు. సుదర్శనం ఫిర్యాదు మేరకు చిత్తూరు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. డోన్‌లో ఉన్న ఇమ్మానుయేలును అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద ఉన్న కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నేరం రుజువుకావడంతో మంగళవారం ఇమ్మానుయేలును అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో అసలైన నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

పెన్షనర్లు.. రేపటిలోగా లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వండి



చిత్తూరు సబ్‌ట్రెజరీ వద్ద వేలిముద్రలు వేసేందుకు అవస్థలు పడుతున్న పెన్షనర్లు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27: మారిన లైఫ్ సర్టిఫికెట్ మార్గదర్శకాలతో విశ్రాంత ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. తాము బతికే ఉన్నామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను ఈనెల 29వ తేదీలోగా అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లావ్యాప్తంగా 12,505 మంది పెన్షనర్లు ఉండగా, ఇంతవరకు సుమారు 10వేల మంది లైఫ్‌సర్టిఫికెట్లు అందించారు. మిగిలిన 2500 మంది గురువారం లోగా సర్టిఫికెట్లు ఇవ్వాలి. గతంలో సర్టిఫికెట్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేయిస్తే సరిపోయేది. ఇప్పుడు జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా పెన్షనర్లు వేలిముద్ర వేసివ్వాలి. దీంతో పండుటాకులు పడుతున్న అవస్థలు అంతాఇంతా కాదు. ఎక్కువ మంది 70 సంవత్సరాలు దాటిన వారే ఉన్నారు. మంగళవారం కూడా చిత్తూరు సబ్‌ట్రెజరీ కార్యాలయం వద్ద పలువురు అవస్థలకు గురయ్యారు. లైఫ్ సర్టిఫికెట్ అందించాల్సిన గడువును పొడిగించే ఆలోచనలో ప్రభుత్వం లేదని, లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వని వారికి ఏప్రిల్‌నెల పింఛన్ ఆగే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. అనారోగ్య సమస్యలతో మంచానపడ్డ పెన్షనర్లు గురువారం లోగా లైఫ్ సర్టిఫికెట్లను సంబంధిత ఉపఖజానా అధికారికి అందించాలని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.కేశవులు తెలిపారు.

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 27: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని డీఈవో దేవరాజు, జిల్లా సైన్స్ అధికారి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏఎస్పీ అరీఫుల్లాకు వినతిపత్రాన్ని ఇస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోండి

- ఏఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన చిత్తూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు

చిత్తూరు, ఫిబ్రవరి 27: సీఎం జగన్ కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఫొటోలు తీసిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడికి ప్రయత్నించిన వైసీపీ అల్లరిమూకలపై చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏఎస్పీ అరీఫుల్లాను కలిసి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అశోక్‌కుమార్, సభ్యులతో పాటు ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ కరీముల్లా, సిబ్బంది వినతిపత్రాన్ని ఇచ్చారు. సీఎం మాట్లాడుతుండగానే చాలా మంది సభ నుంచి వెళ్లిపోయారని, మరికొంత మంది విచ్చలవిడిగా మద్యం తాగుతూ కనపడ్డారని పేర్కొన్నారు. అలాంటి దృశ్యాలను ఫొటోలు తీస్తుండగా వైసీపీ అల్లరిమూకలు దాడికి ప్రయత్నించారన్నారు. దాడికి యత్నించడంతో పాటు కెమెరాను లాక్కోవడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అన్నారు. దాడికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పాలసముద్రం: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకులు దాడికి యత్నించడం పిరికిపంద చర్య అని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు మంగళవారం విమర్శించారు. ఓటమి భయంతోనే నిజాలు బయటపెడుతున్న జర్నలిస్టులపై దాడులకు దిగుతున్నారన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

కుప్పంలో ఒంటరి ఏనుగు హల్‌చల్

భయాందోళనతో పరుగుతీస్తూ కిందపడి రైతుకు తీవ్ర గాయాలు

కుప్పం రూరల్, ఫిబ్రవరి 27: కుప్పం మండలం పైపాళ్యం గ్రామం వద్ద పొలాలలో మంగళవారం తెల్లవారు జామున ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. కంగుంది వైపునుంచి వచ్చిన ఈ ఏనుగు అటుఇటూ పరుగులు తీసింది. ఆ సమయంలో పొలా లు, తోటల్లో ఉన్న రైతులు భయాందోళనకు గురయ్యారు. రోజా పూల తోటలో ఉన్న రైతు మునిరత్నం ఏనుగు నుంచి తనని తాను రక్షించుకోవడానికి పరుగులు తీశారు. ఈ క్రమంలో కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. తొలుత కుప్పం ప్రభుత్వాస్పత్రిలో అనంతరం పీఈఎస్‌లో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న మునిరత్నంను సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ పరామర్శించారు. వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మొదలియార్ సాధికార సమితి అధ్యక్షుడు మునిరత్నం రైతును పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వారికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



చికిత్స పొందుతున్న రైతు మునిరత్నం

పేలుడు పదార్థం తిని ఆవుకు గాయాలు

రామకుప్పం, ఫిబ్రవరి 27: రామకుప్పం మండలం 89పెద్దూరు అటవీప్రాంతంలో వన్యప్రాణుల వేటగాళ్ళు పేట్రేగిపోతున్నారు. తరచూ వీరి ఉచ్చుకు మూగజీవాలు బలైపోవడం, తీవ్రగాయాలకు గురవడం పరిపాటిగా మారింది. 89పెద్దూరు సమీపంలోని ఉప్పువంక అటవీప్రాంతంతో మంగళవారం సాయంత్రం వన్యప్రాణుల వేటకు వేటగాళ్లు అమర్చిన పేలుడు పదార్థ ఉండను తినేందుకు ఓ ఆవు ప్రయత్నించింది. ఈ క్రమంలో సంభవించిన పేలుడుతో తీవ్రంగా గాయపడింది. సాయంత్రమైనా ఆవు ఇంటికి రాకపోవడంతో రైతు రవి అటవీ ప్రాంతంతో వెదకుతూ వెళ్లారు. నోటికి తీవ్రగాయమైన ఆవును గుర్తించి, ఇంటికి తీసుకొచ్చారు. నెల రోజుల కిందట ఇతడికి చెందిన ఓ ఆవు కూడా పేలుడు పదార్థ ఉండను తిని మృత్యువాత పడింది. అంతకు ముందు నాలుగునెలల కిందట ఇదే అటవీ ప్రాంతంలో వేటగాళ్ల అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చుకు ఓ పులి ప్రాణాలు కోల్పోయింది. ఇప్పటికైనా అధికారులు నిఘా ఏర్పాటు చేసి, వేటగాళ్ల దుశ్చర్యలను నిలువరించాలని స్థానికులు కోరుతున్నారు.



చెర్లోపల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి హత్య



గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 27: గంగాధర నెల్లూరు మండలం చెర్లోపల్లె వద్ద గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యారు. సీఐ శంకర్ తెలిపిన మేరకు.. చిత్తూరు- తిరుత్తణి ప్రధానరహదారి పెద్దకాల్వ పంచాయతీ చెర్లోపల్లె దళితవాడకు సమీపంలోని తోపులో సోమవారం రాత్రి కొందరు మద్యం తాగారు. తర్వాత ఒక వ్యక్తి తలమీద ఎవరో బండరాయితో దారుణంగా కొట్టి హత్యకు పాల్పడినట్లుగా విచారణలో ప్రాథమికంగా గుర్తించారు. హత్యకు గురైనవ్యక్తి మద్యం తాగిన వారికి సంబంధించిన వాడా.. లేదా మరెవరైనానా? ఏ కారణం చేత హత్య చేశారనేది తేలాల్సి ఉంది. హత్యాస్థలాన్ని, మృతదేహాన్ని చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. క్లూస్‌టీమ్ పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించడంతో పాటు కొన్ని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, సిమెంట్ రంగుప్యాంట్, షర్ట్, రజనీకాంత్ బొమ్మకలిగిన తెల్ల టీషర్ట్ ధరించి ఉన్నాడన్నారు. ఇతడి వివరాలు తెలిసిన వారు చిత్తూరు డీఎస్పీ 94407 96704, సీఐ 94407 96716 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. చిత్తూరు వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్‌ఐలు రామాంజనేయులు, వెంకటసుబ్బమ్మ కూడా హత్యాస్థలాన్ని పరిశీలించారు.

కార్పొరేటర్‌పై దుండగుల దాడి



చికిత్స పొందుతున్న శశికుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 27: చిత్తూరు నగరంలోని 42వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ శశికుమార్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో ఆయన చెవి భాగంలో తీవ్ర గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తన సొంత పనుల నిమిత్తం కార్పొరేటర్ శశికుమార్ మంగళవారం కొంగారెడ్డిపల్లెకు వెళ్లి ఇంటికి తిరుగుపయనం అయ్యారు. ఆర్టీసీ బస్టాండు మీదుగా రైల్వే స్టేషన్ సమీపంలో వస్తున్న సమయంలో పక్కనే ఉన్న రైల్వే ట్రాక్‌పై నుంచి కొంత మంది చప్పట్లు కొట్టి పిలిచారు. దీంతో ఆయన ద్విచక్ర వాహనాన్ని ఆపి వారి వద్దకు వెళ్లారు. రాత్రి సమయం కావడంతో ఆ ప్రాంతం చీకటిగా ఉంది. శశికుమార్ వారి దగ్గరకు వెళ్లగానే అక్కడున్న వారు బీరు బాటిళ్లతో అతడి తలపై కొట్టే సమయంలో తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో చెవి భాగంపై తగలడంతో గట్టిగా అరవగా.. సమీపంలోని ఆటో డ్రైవర్లు వెళ్లారు. తన తమ్ముడికి ఫోన్ చేయమని నంబరు చెప్పి శశికుమార్ పడిపోయారు. ఆటో డ్రైవర్ల సమాచారంతో కుటుంబీకులు అక్కడికి చేరుకుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చికిత్స పొందుతున్న శశికుమార్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన మాట్లాడలేని స్థితిలో ఉన్నారు. అతడు కోలుకున్నాక దాడి గురించి పూర్తి వివరాలు తెలియవచ్చని పోలీసులు అంటున్నారు.

కుప్పం మున్సిపల్ కమిషనరుగా నాగేశ్వరరావు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 27: చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపల్ కమిషనరుగా నెల్లూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న బి.నాగేశ్వరరావును నియమిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఇప్పటి వరకు తిరుపతి మున్సిపల్ అదనపు కమిషనర్ కుప్పం ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వహిస్తుండగా ఆ స్థానంలోకి నాగేశ్వరరావును బదిలీ చేసింది.

నవకంఠ రావణుడు!



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: శ్రీకాళహస్తీశ్వరాలయానికి కానుకగా భక్తులు సమర్పించిన రావణాసుర వాహనమిది.శివరాత్రి ఉత్సవాల ఊరేగింపులో వాడుకునేందుకు ఇద్దరు భక్తులు దారువుతో తయారు చేసిన ఈ వాహనాన్ని సోమవారం ముక్కంటి ఆలయానికి అందజేశారు. అయితే పది తలలుండాల్సిన రావణాసురుడికి 9మాత్రమే వుండడాన్ని అధికార యంత్రాంగం కానీ , ధర్మకర్తల మండలి కానీ గుర్తించకనే ఆలయంలో పెట్టేశారు. ప్రచార ఆర్భాటం, కమీషన్ల కక్కుర్తిపై దృష్టి పెట్టడం తప్ప ఇలాంటి వాటి గురించి ఎందుకు ఆలోచిస్తారంటూ భక్తజనం నుంచీ పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.

స్విమ్స్ శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: స్విమ్స్ శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలను మార్చి ఒకటో తేదీనుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గైనకాలజీ, ఒబెస్ట్రిక్ (స్త్రీల వ్యాధులు, ప్రసూతి విభాగం), పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల పరిధిలో ఆరోగ్యశ్రీ కింద నగదు రహిత వైద్య సేవలు అందిస్తామన్నారు. సాధారణ, సిజేరియన్ కాన్పులు, టాన్సిల్స్, కాటరాక్ట్, హెర్నియా, అపెండిక్స్, మొలలు, థైరాయిడ్‌తోపాటు సాధారణ జబ్బులైన జ్వరాలు, వాంతులు, విరేచనాలు మొదలైన వాటికి కూడా నగదు రహిత వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అతివేగానికి ఇద్దరు యువకుల బలి





మృతులు హరీష్, రామ్‌చరణ్

రేణిగుంట,ఫిబ్రవరి 27:అతివేగంతో బైకులను నడిపి ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. తిరుపతి జిల్లా గాజులమండ్యం ఎస్‌ఐ ధర్మారెడ్డి కథనం మేరకు.... చెన్నై-రేణిగుంట జా తీయరహదారిలో రేణిగుంట మండలం మొలగమూడి బస్టాప్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. నారాయణవనానికి చెందిన హరీష్(22), ఏర్పేడు మండలం అంజిమేడుకు చెందిన రామ్‌చరణ్(17) పుత్తూరు వైపు నుంచి పల్సర్ బైక్‌పై వస్తుండగా మొలగమూడి బస్టాప్ సమీపంలో రివర్స్ చేస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.మృతదేహాలను పోస్టుమార్టం కోసం తిరుపతి లోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 70,077 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,427 మంది తలనీలాలు సమర్పించారు.

కుప్పంపై సీఎం కపట ప్రేమ : గౌనివారి



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, ఫిబ్రవరి 27: కుప్పం నియోజకవర్గంపై సీఎం జగన్ చూపుతున్న కపట ప్రేమను ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. రామకుప్పం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గుండిశెట్టిపల్లె సభలో సీఎం జగన్ అన్నీ అబద్ధాలే చెప్పారన్నారు. శ్రీశైలంనుంచి (650 కిలోమీటర్లు) కొండలు, గుట్టల మీదుగా కుప్పానికి హంద్రీ-నీవా జలాలను తాను తీసుకొచ్చానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2015లో టీడీపీ ప్రభుత్వం హంద్రీ-నీవా పనులు ప్రారంభించి 2019నాటికి 80శాతం పూర్తి చేసి, వి.కోట మండలం కృష్ణాపురం వరకు కృష్ణాజలాలను తీసుకొచ్చిందన్నారు. కుప్పం ప్రాంతంలో అప్పటి వైసీపీ ఇన్‌చార్జి చంద్రమౌళి పలుచోట్ల రైతులను రెచ్చగొట్టి కోర్టులకు వెళ్లేలా చేయడంతో అక్కడక్కడా పనుల అసంపూర్తికి కారకులయ్యారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల స్తబ్దుగా ఉండి, ఇప్పుడు హడావిడిగా 20శాతం పనులు పూర్తి చేసిన వైసీపీ పాలకులు గొప్పలు చెప్పుకుంటూ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో కుప్పం నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని తాను పులివెందులతో సమానంగా అభివృద్ధి చేశానని చెప్పిన సీఎం జగన్.. తన పాలనలో కుప్పానికి ఎన్ని నిధులిచ్చారో, పులివెందులకు ఎంత ఖర్చు పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా. అబద్ధాలను ప్రచారం చేసినా ప్రజలు నమ్మరన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించి చంద్రబాబు సీఎం కావడం తథ్యమన్నారు. ఈ సమావేశంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీఎంపీపీ ఆంజినేయరెడ్డి,నేతలు రామ్మూర్తి, మహ్మద్‌రఫీ, మనోహర్, వెంకటరమణ, సుబ్బి, సురేష్, భానుమూర్తి, భాస్కర్, జ్ఞానశేఖర్‌రెడ్డి, పద్మమ్మ, అలివేలు మంగమ్మ, రామలింగారెడ్డి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో 1న కాంగ్రెస్ బహిరంగ సభ

● ప్రత్యేక హోదా అజెండాగా నిర్వహిస్తున్నామన్న గిడుగు



విలేకర్ల సమావేశంలో గిడుగు రుద్రరాజు

చిత్తూరు రూరల్/పలమనేరు, ఫిబ్రవరి 27: ప్రత్యేక హోదా అజెండాతో తిరుపతిలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మంగళవారం ఆయన చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో, పలమనేరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి సభలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు గడిచినా నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను బాగుచేయాలంటే తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలన్నీ బీజేపీకి కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తాము ప్రజల మేలు చేసే పథకాలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ సచిన్‌పైలట్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఇతర నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సభకు నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. చిత్తూరు సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు శంకర్, ఏఐసీసీ మెంబర్ పార్థసారథిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు విక్టోరియా, రాణి, నేతలు చిట్టిబాబు, శంకర్ టిక్కీ రాయల్, వెంకటేష్, నరసింహులు, పరదేశి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పలమనేరు పార్టీ కార్యాలయంలో నాయకులు శ్రీరామమూర్తి, పార్థసారథిరెడ్డి, రవీంద్రరెడ్డి, ప్రభాకర్, ధనంజయగౌడు, భాస్కర్, దొరస్వామి, మణి తదితరులు గిడుగు రుద్రరాజును కలిశారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నిబంధనలను పాటించాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. నోడల్ అధికారులందరూ గురువారం నుంచి తమకు కేటాయించిన ఎన్నికల విధుల్లో పూర్తిగా నిమగ్నం కావాలన్నారు. ఎన్నికలకు అవసరమైన సిబ్బందిని మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ గుర్తించిందని, అధికారుల వివరాలను అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. ఈవీఎంలను సరైన రీతిలో భద్రపరచాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవోలు, ఈఆర్వోలు, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి

జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. మ్యుటేషన్ ప్రక్రియలో దొర్లిన తప్పులను సరిదిద్దాలని, ఆర్డీవో స్థాయిలో అనుమతి జరిగిందన్నారు. 1500 ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైతే ఆక్సిలరి పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. రీ సర్వే మూడో దశను త్వరలో పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో సర్వే ఏడీ మహబూబ్ భాషా, ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, డీటీలు, గ్రామ సర్వేయర్లు, గ్రామ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధ్యాపక పదోన్నతులకు పచ్చజెండా

ఎస్వీయూ పాలకమండలిలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్వీయూనివర్సిటీలోని అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తూ పాలకమండలి పచ్చజెండా ఊపింది. యూనివర్సిటీలోని 53 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించేందుకు ఇటీవల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ క్రమంలో దీనిపై చర్చించి అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగానూ, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లగానూ పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఆమోదిస్తూ తీర్మానం చేశారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం వీసీ ఛాంబర్‌లో పాలకమండలి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఆర్థిక శాఖ అధికారులు ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ సమావేశం సాగింది. వర్సిటీకి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పాలకమండలి సభ్యులు జ్యోతి, నారాయణబాబు, సంధ్యారాణి, మొహిద్దీన్ బాష, మంజుల, సుగుణమ్మ, సుమకిరణ్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

తీర్మానాలివే..

● 53 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు ● నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ జారీ చేసిన జీవో-10 అమలు ● పలు భవన నిర్మాణ పనులు, వాటికి సంబంధించిన నిధుల అంచనాకు ఆమోదం ● నూతన కోర్సుల ఏర్పాటుకు అనుమతి ● వివిధ విభాగాల్లో దాతల సహకారంతో గోల్డ్ మెడల్స్‌కు ఆమోదం ● ఆర్థికపరమైన అంశాలపై చర్చించి, నిర్ణయం తీసుకునేందుకు ఐదుగురితో ఆర్థిక సలహా మండలి ఏర్పాటు.

స్కాలర్‌షిప్ ఇవ్వకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తాం

మహిళా వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు జాతీయ ఎస్సీ కమిషన్ హెచ్చరిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్సీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్, సర్టిఫికెట్లు ఇవ్వకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని పద్మావతి మహిళా వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ అరుణ్ హల్దార్ హెచ్చరించారు.2018 నుంచి యూనివర్సిటీలో నిర్వహించిన బీఏ, ఎంఏ పబ్లిక్ పాలసీ అండ్ ఆంత్రోపాలజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉంచారు. దాంతో చండీప్రియ (చంద్రలేఖ) నేతృత్వంలోని 31మంది ఎస్సీ విద్యార్థినులు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషన్.. వర్సిటీ రిజిస్ట్రార్, ఇతర అధికారులకు సమన్లు జారీ చేసింది. కమిషన్ ఎదుట విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఇటీవల కమిషన్ చేపట్టిన విచారణకు రిజిస్ట్రార్ హాజరై వివరణ ఇచ్చారు. దాంతో 21 రోజుల్లోపు విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్, సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరింది. లేకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించేందుకు వర్సిటీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, సోషియల్ వెల్ఫేర్ అధికారులకు లేఖ రాశారు.

ఏడాదిన్నరగా నడుస్తున్న వ్యవహారం

ఏడాదిన్నరగా ఈ వ్యవహారం నడుస్తోంది. గతంలో విద్యార్థినులు వర్సిటీలోనే ప్రత్యక్ష ఆందోళన కూడా చేపట్టారు. రూ. కోటీ 50 లక్షల మేర విద్యార్థినులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయి.

షార్‌లో పిఫ్ భవనం ప్రారంభం



షార్‌లో నిర్మించిన పిఫ్ భవనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27 : తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్‌లో నిర్మించిన పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటి (పిఫ్) భవనాన్ని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. పీఎస్ఎల్వీ రాకెట్లతో పాటు చిన్న తరహా రాకెట్ల తయారీ, అనుసంధానం కోసం ఈ భవనాన్ని నిర్మించారు. పీఎస్ఎల్వీ ప్రయోగాలకే కాకుండా ఎస్ఎస్ఎల్వీ వంటి చిన్న ప్రయోగాల వేగవంతానికి కూడా ఇదెంతో దోహదపడుతోంది. ఇది అందుబాటులోకి రావడంతో ఇకపై ఏడాదికి 15 ప్రయోగాలు చేపట్టాలని ఇస్రో లక్ష్యం పెట్టుకుంది.ప్రధాని మోదీ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో సుమారు రూ.1800 కోట్లతో నిర్మించిన మూడు ప్రాజెక్టులను ప్రారంభించారు. వీటిలో షార్‌లోని పిఫ్, మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ అండ్ స్టేజ్ టెస్ట్ ఫెసిలిటి, వీఎస్ఎస్‌సీలో ట్రైసోనిక్ విండ్ టన్నెల్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.

తప్పుల చక్రవర్తి సీఎం జగన్

● శ్రీవారి ఆభరణాలు అపహరించిన రమణ దీక్షితులు
● మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆరోపణ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 27: సీఎం జగన్ తప్పుల చక్రవర్తి అని, నోరు తెరిస్తే అబద్ధాలే చెబుతారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆరోపించారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కృష్ణా జలాలను కుప్పానికి తీసుకురావడానికి గత టీడీపీ ప్రభుత్వం రూ.470 కోట్లు ఖర్చుపెట్టి 87 శాతం పనులు పూర్తిచేసిందని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లల్లో కేవలం రూ.30 కోట్లు ఖర్చుపెట్టిందన్నారు. హంద్రీ- నీవా పనులు ఏ ప్రభుత్వ హయాంలో జరిగాయో ప్రజలకు తెలిసినా సీఎం జగన్ అబద్దాలు చెప్పి, వారిని మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. టీటీడీ గౌరవ ప్రధానార్చకుడిగా పనిచేసిన రమణ దీక్షితులు శ్రీవారి అభరణాలను అపహరించారని దొరబాబు ఆరోపించారు.

12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స సక్సెస్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో 12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమైందని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి ప్రారంభమైన ఈ శస్త్రచికిత్స మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు జరిగిందన్నారు. శ్రీకాకుళం జిల్లా రాజోలుకు చెందిన ధర్మారావు(28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురికావడంతో ఆయన గుండెను శ్రీకాకుళం నుంచి వైజాగ్ అక్కడ నుంచి తిరుపతి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంకు సోమవారం రాత్రి 10.25 నిమిషాలకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ గుండెను డైలేటెట్ కార్డియోమయోపతి వ్యాధితో బాధపడుతూ శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 42 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా అమర్చినట్లు డైరెక్టర్ వివరించారు. శస్త్ర చికిత్స చేయించుకున్న వ్యక్తి పూర్తి ఆరోగ్యంగా కోలుకుంటున్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అభినందించారు.

పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్వీయూనివర్సిటీ పరిధిలో పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. మార్చి ఒకటి నుంచి ఏడో తేదీదాకా పరీక్షలు నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. అయితే, ఇదే తేదీల్లో టెట్‌ను ప్రభుత్వం నిర్వహించనుంది. దాంతో పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు మార్చి ఏడో తేదీకి వాయిదా పడ్డాయి. 14వ తేదీ దాకా ఈ పరీక్షలు కొనసాగుతాయని సీఈ దామ్లానాయక్ పేర్కొన్నారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

సూపర్ సిక్స్‌తో టీడీపీ హిట్ కొట్టాలి



శిక్షణ కార్యక్రంలో మాట్లాడుతున్న పీఎస్.మునిరత్నం

కుప్పం, ఫిబ్రవరి 27: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ హిట్ కొట్టాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రతాప్‌లు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం కుప్పం మున్సిపల్ టీడీపీకి సంబంధించి కుటుంబ సాధికార సారథులు (కేఎస్ఎస్) అయిన మహిళలకు సూపర్ సిక్స్ పథకాల గురించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లోని ప్రతి పథకమూ మహిళల సాధికారతను పెంచేదిగా, వారి ఆర్థిక స్వావలంబనకు మెట్టుగా ఉపయోగ పడుతుందన్నారు. ఈ విషయాన్ని ఇంటింటికీ వెళ్లి మహిళలకు తెలియజెప్పి, వారిలో అవగాహన పెంచాల్సిన బాధ్యత కుటుంబ సాధికార సారథుల దేనన్నారు. చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో లక్ష మెజారిటీ సాధించడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, శారదమ్మ, తిరుమగశ్ తదితరులు పాల్గొన్నారు.

3న పుంగనూరులో ధర్మపోరాట సభ

● రామచంద్రయాదవ్

పుంగనూరు, ఫిబ్రవరి 27: బీసీవై పార్టీ ఆధ్వర్యంలో మార్చి మూడో తేదీ పుంగనూరులో ధర్మపోరాట సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సదుంలో రైతుభేరి బహిరంగసభను, జనవరి 13న పుంగనూరులో ధర్మపోరాట సభను మంత్రి పెద్దిరెడ్డి తన అధికారంతో అడ్డుకున్నారని ఆరోపించారు. అయితే 3వ తేదీ సభను అన్ని న్యాయపరమైన అనుమతులతో నిర్వహించను న్నామని వివరించారు. మధ్యాహ్నం 3గంటలకు చదళ్ల-కాటిపేరి రోడ్డులోని తన మామిడితోటలో సభకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. రైతులు, యువత, బలహీన వర్గాల కోసం ప్రధానంగా వనరుల, రైతుల శ్రమదోపిడీ, వలసలు, నిరుద్యోగ సమస్య, మహిళల భద్రత, పాలకుల అరాచకాలపై చర్చించి రాజకీయ మార్పు కోసం ధర్మపోరాట సభను ఏర్పాటు చేశామని తెలియజేశారు. భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

కుప్పంలో జగన్ అబద్ధాల వరద : చల్లా



రొంపిచెర్ల, ఫిబ్రవరి 27: కుప్పంలో జగన్ అబద్ధాల వరద పారించారని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రొంపిచెర్లలో విలేకర్లతో మాట్లాడారు. పులివెందులలో ఎంటలు ఎండిపోతుంటే కుప్పానికి నీరు ఇస్తానని అనడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు కుప్పం కాలువ పనులు 87 శాతం పూర్తిచేస్తే జగన్ 10 శాతం మాత్రమే చేశారన్నారు. అదీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బినామీగా చేసిన పనులు నాశిరకం కావడంతో కెనాల్ తెగిపోయిందన్నారు. అన్నమయ్య డ్యాం తెగి 42 మంది కొట్టుకుపోయినా ఇంతవరకు ఒక ఇల్లు కూడా కట్టించలేదన్నారు. పింఛా డ్యాం తెగిపోయినా మరమ్మతులు చేయలేదన్నారు. ఆవులపల్లి రిజర్వాయర్ పేరుతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాంట్రాక్టు సంస్థకు రూ.600 కోట్లు దోచిపెట్టారని విమర్శించారు.

చెట్టును ఢీకొన్న కారు.. ముగ్గురికి తీవ్ర గాయాలు



చౌడేపల్లె, ఫిబ్రవరి27: అతి వేగంతో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కథనం మేరకు.. పెద్దపంజాని మండలం కూరగాయల కొత్తపల్లెకు చెందిన మధు(23) జగదీష్(25) వెంకటమణ (38) కర్ణాటకు చెందిన కారులో మంగళవారం చౌడేపల్లె మీదుగా పుంగనూరు వైపు బయలు దేరారు. దుర్గసముద్రం సమీపంలో ఓ ద్విచక్రవాహనదారుడిని ఢీకొని అక్కడ కారు ఆపకుండా అతి వేగంగా చౌడేపల్లెకు వచ్చేశారు. చౌడేపల్లె నుంచి పుంగనూరు వైపు వెళుతూ దొరబావితోట మలుపులో పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న బారికేడ్లను ఢీకొని ఎదురుగా ఉన్న ఓ చెట్టుకు ఢీకొన్నారు. కారులోని ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. కారులోనే చిక్కుకుపోయారు. స్థానికులు, పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో వారిని కారు నుంచి వెలికి తీశారు. 108 లో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎంపీటీసీ గడ్డివామికి నిప్పు



గంగవరం, ఫిబ్రవరి 27: అధికార పార్టీ ఎంపీటీసీకి చెందిన గడ్డివామికి ప్రత్యర్థులు నిప్పంటించారు. కోటగురు పల్లెకు చెందిన సుమిత్రమ్మ ఎంపీటీసీ. వ్యవసాయ ఆధారిత కుటుంబం. పాడి ఆవులు ఉన్నాయి. మంగళ వారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఉన్నట్టుండి ఇంటిపక్కనే ఉన్న గడ్డివామి నుంచి పొగలు వచ్చాయి. బయటకు వచ్చి చూడగా గడ్డివామి మంటల్లో కాలుతోంది. వెంటనే వామి పక్కనే ఉన్న పశువులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆపివేశారు. సకాలంలో మంటలు ఆర్పి ఉండకపోతే గడ్డివామి పక్కనే ఉన్న ఎంపీటీసీ ఇల్లు, కోళ్లఫారం, వేరుశెనగ కాయల మిల్లు కాలిపోయేవని ఎంపీటీసీ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షతోనే ప్రత్యర్థి వర్గానికి చెందిన నాయకుల ప్రోద్బలంతో విజయకుమార్‌రెడ్డి కుటుంబసభ్యులే నిప్పంటించారని ఎంపీటీసీ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ పాలనలోనే పల్లెసీమల్లో ప్రశాంతత



గొరివిమాకులపల్లెలో మాట్లాడుతున్న మునస్వామి

రామకుప్పం, ఫిబ్రవరి 27: వైసీపీ పాలనలో పల్లెసీమల్లో అభివృద్ధి స్తంభించి, అరాచకాలు, దౌర్జన్యాలు పెచ్చుమీరి ప్రజలు భయభ్రాంతుల మధ్య జీవించాల్సి వస్తోందని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. మంగళవారం రామకుప్పం మండలం గొరివిమాకులపల్లె, మణీంద్రం గ్రామాల్లో నిర్వహించిన గ్రామవికాస సమావేశాల్లో వారు మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగాలన్నా, ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నా టీడీపీ ప్రభుత్వం రావాలన్నారు. ఆయా సమావేశాల్లో నేతలు రామ్మూర్తి, గంటప్పగౌడు, మహ్మద్‌రఫీ, మనోహర్, వెంకటరమణ, కామరాజనాయక్, విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, భానుమూర్తి, సుబ్రి, సురేష్, భానుమూర్తి, భాస్కర్, జ్ఞానశేఖర్‌రెడ్డి, పద్మమ్మ, అలివేలుమంగమ్మ, రామలింగారెడ్డి, శ్రీరామరెడ్డి, మంజునాథరెడ్డి, రాణెమ్మ పాల్గొన్నారు.

వరకట్నం కేసు నమోదు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి27: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పుంగనూరు పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ నాగరాజ కథనం మేరకు.. మండలంలోని నేతిగుట్లపల్లెకు చెందిన రెడ్డి రాణి(26)కి సోమల మండలం కందూరుకు చెందిన వెంకటరమణతో 2021లో వివాహమైంది. కొద్ది రోజులుగా భర్త మద్యానికి బానిసయ్యాడు. పుట్టింటి నుంచి డబ్బు తీసుకురావాలని రోజూ భార్యను వేధించేవాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అక్రమ రిజిస్ట్రేషన్ ఎందుకు చేశారు?



సబ్ రిజిస్ట్రార్‌ను నిలదీస్తున్న బాధితుడు రాజేంద్ర

కుప్పం, ఫిబ్రవరి 27: వివాదంలో ఉండి కోర్టులో కేసు నడుస్తున్న భూమిని తన ప్రత్యర్థి పేరుతో తప్పుడు రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని బాధితుడు మంగళవారం కుప్పం సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్యను నిలదీశారు. బాధితుడు రాజేంద్ర కథనం మేరకు.. శాంతిపురం మండలం తులసినాయనిపల్లె గ్రామానికి చెందిన రాజేంద్ర, గోవిందరాజులు అనే ఇద్దరికి కలిపి సంయుక్తంగా సర్వే నెంబర్ 33-3లో 5.20 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిపై వీరి మధ్య వివాదం నడుస్తోంది. పైగా కోర్టులో కేసు ఉంది. భూమిని ఎవరి పేరు మీదా రిజిస్ట్రేషన్ చేయ రాదంటూ ఈనెల 1న సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం కూడా ఇచ్చారు. ఇద్దరినీ పిలిచి మాట్లాడుతానని చెప్పిన సబ్ రిజిస్ట్రార్, తర్వాత సదరు భూమిని అక్రమంగా గోవిందరాజులు పేరుపై రిజిస్టర్ చేశారు. లాయరు నోటీసు పంపినా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని సబ్ రిజిస్ట్రార్‌ను నిలదీశారు. సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని రాజేంద్ర కోరారు.

బీజేపీని గెలిపించండి

పెద్దపంజాణి, ఫిబ్రవరి 27: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ పలమనేరు నియోజకవర్గ కన్వీనర్ గౌనివారి విజయకుమార్ కోరారు. మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రజా పోరు యాత్ర మండలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ కో-కన్వీనర్ ఉమాపతి, మండల నాయకులు వెంకటరమణ, వెంకట్రామిరెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, మసెన్న, నరసింహులు, సహదేవ్, కుమారస్వామి, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘ నాయకులపై కేసులు ఎత్తివేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

పలమనేరు, ఫిబ్రవరి27 : ప్రభుత్వం ఉద్యోగ సంఘ నాయకులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని మంగళవారం పలమనేరు ఎన్జీఓ కార్యాలయంలో నిరసన వ్యక్తంచేశారు. ఏపీ జేఏసీ పిలుపు మేరకు స్థానిక ఎన్జీఓ హోంలో ఉద్యోగులు ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలమనేరు ఏపీ జేఏసీ ఛైర్మన్ ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపైన పలు సందర్భాల్లో పోరాటాలు చేసిన వివిధ సంఘాల నాయకులపై ప్రభుత్వం కేసులు బనాయించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్జీఓ సంఘ ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, గ్రామసచివాలయ వార్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రమణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయకుమార్, సుదర్శనాచారి, బాలక్రిష్ణ, పలు ఉద్యోగ సంఘాల నుంచి దాము హైదర్, బిందు, వల్లెమ్మ, రాజు, బాలజి, రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.2లక్షల సాయం



రామకుప్పం, ఫిబ్రవరి 27: రామకుప్పం మండలం బల్ల గ్రామంకు చెందిన టీడీపీ కార్యకర్త మురుగప్ప అనే వ్యక్తి రెండు నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతని కుటుంబానికి టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా రూ.2లక్షలు ఆర్థికసాయాన్ని మంగళవారం స్థానిక టీడీపీ నేతలు ఎర్రప్ప, శ్రీనివాసులు, శంకర్, మునిరత్నం, చంద్రశేఖర్, మురుగేష్, హనుమంతులు అందజేశారు.

ద్విచక్రవాహనం ఢీకొని వాచ్‌మన్ మృతి



వెంకటాద్రి మృతదేహం

తిరుపతి (నేరవిభాగం)/కల్లూరు, ఫిబ్రవరి 27: ద్విచక్రవాహనం ఢీకొని ఓ వాచ్‌మన్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం దిన్నుపాటివారిపల్లెకు చెందిన వెంకటాద్రి తిరుపతి మహిళా వర్సిటీ సమీపంలోని పశుపతి అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ.. అక్కడే భార్యాబిడ్డలతో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి పొద్దుపోయాక ఉప్పరపల్లె రోడ్డుపై నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఆయన్ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటాద్రికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను 108లో రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీనిపై తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్తున్న పెన్షన్లు రద్దు చేశారు : అమర్



పలమనేరులో మహిళకు కరపత్రం అందజేస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి27 : తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేదలకు ఇస్తున్న పెన్షన్లను, పలమనేరు మున్సిపాలిటీలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపి వేసిందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీలో 'ఇంటింటా తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించారు. కాకాతోపు, గాంధీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. మైనారిటీల కోసం మంజూరు చేసిన కమ్యూనిటీ భవనం, బీసీ భవనం, కళామందిరం నిర్మాణాలకు స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేస్తూ జీవోలు విడుదల చేసినా నేటి వరకు ఆ పనులు చేపట్టలేదని విమర్శించారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు పట్టణ సమీపంలోని పారిశ్రామికవాడలోను, గంగవరం మండలం నాలుగు రోడ్ల వద్ద ఉన్న పారిశ్రామికవాడలోను ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు చేసి వందలాది మందికి జీవనోపాధి కల్పించామన్నారు. మైనారిటీలకు టీడీపీ హయాంలో ఇస్తున్న రంజాన్ తోఫాను నిలిపి వేశారని, వి.కోటకు మంజూరు చేసిన ఉర్దూ జూనియర్ కళాశాల ఇంతవరకు ప్రారంభించలేదన్నారు. పైగా ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించిన తనపై హత్యాయత్నం, మార ణాయుధాల వినియోగం కేసులు పెట్టారన్నారు. తనకే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో ఆలోచించాలన్నారు. ఇలాంటి అరాచకాలు పోవాలన్నా, అభివృద్ధి జరగాలన్నా వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు ఖాజాపీర్, ఆర్సీసీ కుట్టి, గిరిబాబు, లోకేష్‌ఆచారి, సుబ్రమణ్యం గౌడు, చాంద్‌బాషా, నాగరాజు, మదన్‌మోహన్, చిన్ని, శ్రీనివాసులు, వీరప్ప, విజయ్, రోషన్, జనసేన నాయకులు దిలీప్, చైతన్య, నాగరాజు పాల్గొన్నారు.

అబద్ధాల మాంత్రికుడు జగన్ : టీడీపీ



ప్రచారం చేస్తున్న ఖాదర్‌బాషా తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 27: సీఎం జగన్ అబద్ధాల మాంత్రికుడని టీడీపీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా విమర్శించారు. కుప్పం పురపాలక సంఘం 18వ వార్డులో ఆయన మైనారిటీ నాయకులతో కలిసి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ-నీవా ప్రాజెక్ట్ సృష్టికర్త దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అయితే, దాన్ని 90 శాతం పూర్తి చేసింది చంద్రబాబు అన్నారు. టీడీపీ ఐదేళ్ల హయాంలో రాయలసీమ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12,500 కోట్లు ఖర్చు చేశామన్నారు. కుప్పం బ్రాంచి కాలువ నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం 400 కోట్లు ఖర్చుచేసి 80 శాతం పనులు పూర్తి చేస్తే, జగన్ కేవలం 30 కోట్లు వ్యయం చేసి కనీసం 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుమారుడు ఎంపీ మిథున్ రెడ్డిలు బినామీగా చేసిన ఆ పనులు కూడా నాసిరకంగా ఉన్నందువల్ల కుప్పం కెనాల్ తెగిపోయిందని ఆరోపించారు. అయినా ఎన్నికల ప్రచారం కోసమే హంద్రీ-నీవా కాలువ ప్రారంభోత్సవం నాటకాన్ని జగన్ ఆడారని విమర్శించారు. పులివెందులలో నీళ్లు ఇవ్వలేకపోయిన జగన్ కుప్పంలో నీళ్లు వచ్చేశాయంటూ షో చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు కుప్పానికి ఏమీ చేయలేదని చెప్పడం జగన్ అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్, పట్టణ అధ్యక్షుడు ఉమర్, అన్వర్, ఇమ్రాన్, ఖాసీం, రఫీ, ఫజల్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు ముందుకురావాలి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలు ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకులు అయూబ్‌ఖాన్ పిలుపునిచ్చారు. బీజేపీ చేపట్టిన ప్రజా పోరుయాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళ వారం గుడిసెబండ, గూడూరుపల్లె, కొండసముద్రం తదితర గ్రామాల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధం పేరుతో వైసీపీ కార్యక్రమాలకు ప్రభుత్వ ఉద్యోగులను, ప్రభుత్వ బస్సులను వాడుకుని ప్రజాధనాన్ని దోచుకోవడం తగదన్నారు. వైసీపీ కార్యక్రమాలకు సొంత డబ్బులు ఖర్చు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మఠంబాబు, నరసిం హులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసం కోసమే పార్కులు



పార్కు పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్

పుంగనూరు, ఫిబ్రవరి27: పుంగనూరు మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని కలిగించడానికి పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళ వారం పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపైన రూ.3కోట్లు, గోకుల్ థియేటర్ వెనుకవైపు, ఎల్ఐసీ కాలనీ వద్ద రూ.20లక్షలతో పార్కులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీటిల్లో చిన్నపిల్లలు ఆడుకోవడానికి బొమ్మలను ఏర్పాటు చేశామని, పెద్దలు, మహిళలు కుర్చోవడానికి బెంచీలు, పూలమొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. త్వరలోనే పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ డీఈఈ మహేశ్, ఏఈ కృష్ణకుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయాలి

సదుం, ఫిబ్రవరి 27: అప్పుడే పుట్టిన శిశువు దగ్గర నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఈవోపీఆర్ ఆర్డీ వరప్రసాద్ వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై సంబంధిత సిబ్బందికి స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో మంగళ వారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది.

పుంగనూరు రూరల్: మార్చి 3తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. పల్స్‌పోలియోపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మున్సిపల్ కార్యాలయంలో వైద్యఆరోగ్యశాఖ పోస్టర్లును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రంజిత, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అమరనాథరెడ్డి పలువురు అధికారులు, సర్పంచ్‌లు పోస్టర్లు ఆవిష్కరించారు.

సోమల: పల్స్ పోలియోను విజయ వంతం చేయాలని పెద్దఉప్పరపల్లె, కందూరు వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, విజయలక్ష్మీ కోరారు. ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, ఆంజమ్మ, బాలాజీ, కుమార్, జయమ్మ, రహీమా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

గంగవరం, ఫిబ్రవరి 27 : రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసి సముచిత స్థానం కల్పించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు రుద్రరాజు పేర్కొన్నారు. మంగళవారం గంగవరంలోని పార్టీ కార్యాలయం, దండపల్లె రోడ్డులోని వైఎస్సార్ జంక్షన్ వద్ద కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిపార్టీల వారు సంతకాలు చేయడం వల్లే రాష్ట్రాన్ని విభజించి తెలంగాణ ఇచ్చారన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ముక్కలు చేసిందనడం సరికాదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేలా మార్చి 1వ తేదీన తిరుపతిలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, రాష్ట్ర నేతలు పాల్గొంటున్నారని వివరించారు. ఈ సభకు ప్రజలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పార్థసారథిరెడ్డి, రవీంద్రారెడ్డి, శివకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

సోమల, ఫిబ్రవరి 27: సోమల మండలంలో బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిచే పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు జడ్పీటీసీ కుసుమ, ఎంపీపీ ఈశ్వరయ్య తెలిపారు.

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ యల్లప్ప మంగళవారం తెలిపారు.

27పీజీఆర్ ఎస్ఎంఎల్2:సోమలలో జడ్పీ సీఈవో గ్లోరియాను సన్మానించిన మండల పరిషత్ అధికారులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

సోమల, ఫిబ్రవరి 27: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జడ్పీ సీఈవో గ్లోరియా కోరారు. బుధవారం సోమల మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో నూతన నిర్మాణ పనులను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఎన్నిల పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుసుమ, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లగేజీ ఆటో



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి27: పుంగనూరు మినీ బైపాస్ రోడ్డులోని సోమవారం రాత్రి అటవీశాఖ కార్యాలయం ఎదుట డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఓ లగేజీ ఆటో డివైడర్‌పైకి ఎక్కేసింది. రాత్రి కావడంతో రోడ్డులో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

రోడ్డుకు అడ్డుగా ఆగిపోయిన లారీ



చౌడేపల్లె, ఫిబ్రవరి27: ఓ లారీ డ్యామ్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. ఈ సంఘటన చౌడేపల్లె మండలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గడ్డంవారిపల్లె సమీపంలో ఓ రైతు వద్ద కొనుగోలు చేసిన నీలగిరి చెట్ల మొదళ్లతో మదనపల్లెకు చెందిన లారీ బయలుదేరింది. డ్రైవర్ వెంకటేష్. ఈక్రమంలో డ్రైవర్ మద్యం సేవించి లారీని అతి వేగంగా నడుపుతూ బైసాని ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న డ్యామ్‌ను ఢీకొన్నాడు. దీంతో లారీ వెనుక చక్రాల వద్ద యాక్సిల్ విరిగి పోయింది. లారీ రోడ్డుకు అడ్డంగా ఆగిపోయింది. లారీని అతివేగంగా నడపడం కారణంగా ఇలా జరగడంతో స్థానికులు, వాహనదారులు డ్రైవర్‌ను చితకబాది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో డ్రైవర్ పారిపోయాడు. అసలే వారపు సంతకావడంతో వాహనాల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మదర్‌థెరిస్సాలో వెబ్‌డిజైన్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న అకడమిక్ డైరక్టర్ రాజేంద్రరెడ్డి

గంగవరం, ఫిబ్రవరి 27: స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 'బ్యాక్ అండ్ వెబ్ డెవలప్‌మెంట్ విత్ పైతాన్ అనే అంశంపై 5 రోజుల వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో వెబ్‌సైట్‌కు అవసరమైన బ్యాక్‌ఎండ్ డిజైన్‌పై విద్యార్థులకు వివరిస్తామన్నారు. ఈ వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ సునీల్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, హెచ్‌వోడీ లోకేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు, (ఇన్‌సెట్లో) పళని మృతదేహం

రామకుప్పం, ఫిబ్రవరి 27: రామకుప్పం మండలం పంద్యాలమడుగు పంచాయతీ చిన్నబల్దారుకు చెందిన పళని(48) గ్రామసమీపంలోని కుంటలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య భారతి కథనం మేరకు.. పళని, భారతి మధ్య కొన్నేళ్ల క్రితం విభేదాలు వచ్చాయి. ఆమె తన కుమారుడు వెంకటాచలపతితో కలిసి బెంగళూరులో స్థిరపడ్డారు. సోమవారం సాయంత్రం పళని పెద్దబల్దారు గ్రామ సమీపంలోని చెంగప్ప చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి నీటమునిగిపోయాడు. చెరువు సమీపంలో పొలం వద్ద ఉన్న నగేష్ అనే వ్యక్తి గమనించి గ్రామస్తులకు, కుప్పం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి పళని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే అతడు మృతిచెందాడు. ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా పళని సోమవారం రాజుపేట వద్ద సీఎం పర్యటన ప్రాంతానికి వచ్చాడని, అక్కడ అతిగా మద్యం సేవించాడని సమాచారం. ఆ మత్తులో సాయంత్రం గ్రామానికి వస్తూ చెరువులో ఈతకోసం వెళ్లి మత్తులో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడని పలువురు పేర్కొంటున్నారు.

టీడీపీ ఆర్థికసాయం

పళని మృతదేహాన్ని టీడీపీ నేతలు గంటప్పగౌడు, పరశురాం, చంద్రశేఖర్‌రెడ్డి, మునిరాజునాయక్, అప్పాలప్ప తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

జగన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా
రానున్నది టీడీపీ ప్రభుత్వమే



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 27: సీఎం జగన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ అన్నారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండల టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సభలకు తీసుకువచ్చేందుకు అమాయక ప్రజలను ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. ఆర్టీసీ, పాఠశాలల బస్సులను సభలకు తరలించి ఇటు ప్రయాణికులను, అటు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. మరో 50 రోజుల్లో వైసీపీని ఓడించడానికి జనం సిద్ధంగా ఉన్నారన్నారు. కుప్పం రైతులను దగా చేసేందుకు హంద్రీ-నీవా జలాలను ఉదయం 11 గంటలకు వదిలి రాత్రి 11 గంటలకు చుక్కనీరు కూడా లేకుండా చేసిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మధుకుమార్, శ్యామ్, ధరణి ప్రకాష్, సురేష్, కందస్వామి, రవి, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నిన్న ఎన్నికల నీరు విడుదల... నేడు నిలిపివేత

- గాలి భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 27: కుప్పం నియోజకవర్గంలో వైసీపీ ఎన్నికల స్టంట్ వికటించిందని నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కుప్పం ప్రజలకు ఆదరా బాదరాగా హంద్రీ-నీవా కాలువ జలాలు అందించి ఎన్నికలలో లబ్ధి పొందాలని, ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం సాధ్యం కాలేదని తేలిపోయిందన్నారు. సీఎం జగన్ చేతుల మీదుగా హంద్రీ-నీవా కాలువలో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి ఆర్భాటం చేశారేగాని కుప్పానికి కృష్ణా జలాలను తరలించడంలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి వెళ్లిన 12 గంటల్లోనే హంద్రీ-నీవా కాలువలో నీరు ఆగిపోవడంతోనే వారి చిత్తశుద్ధి ఏంటో తెలుస్తోందని భానుప్రకాష్ దుయ్యబట్టారు. పులివెందులకు నీళ్లు ఇవ్వలేక పంటలు ఎండిపోతుంటే పట్టించుకోని జగన్‌రెడ్డి కుప్పంపై కపట ప్రేమ చూపిస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. అంకెల గారడీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని, ఒకసారి మోసం చేయగలవే గాని ప్రతిసారి ప్రజలు మోసపోరని ఆయన హితవు పలికారు.

అహింసతోనే శాంతి



భక్తులకు ఉపదేశం ఇస్తున్న జైన్ గురువులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 27: అహింసతోనే శాంతి సాధ్యమని, అహింసతోనే అభివృద్ధి సాధించవచ్చునన్న నానుడికి భారతదేశం ప్రధాన ఉదాహరణ అని జైన్ గురువులు అన్నారు. మంగళవారం నగరానికి 50 మంది జైన్ గురువులు, సాధువులు, సాధ్వీమణులు రాగా, వారందరికీ చిత్తూరు జైన్ సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అహింస గురించి ప్రబోధిస్తూ కాలినడకన దేశ సంచారం చేస్తూ కర్ణాటక రాష్ట్రం దావణగెరెలో ఏప్రిల్ ఒకటన జరిగే జైన్ సాధు సంఘటన్‌లో పాల్గొనడానికి వెళుతూ చిత్తూరు సీఎం కల్యాణ మండపంలో విడిది చేశారు. ప్రజలందరిలోనూ విచక్షణ, వివేకం, జ్ఞానం తదితర లక్షణాలు మెండుగా ఉన్నాయని, వాటన్నింటినీ సన్మార్గంలో ఉపయోగించిననాడే సార్థకత ఏర్పడుతుందని వారు ఉద్బోధించారు. జైన్ గురువులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జైన్ సంఘం నాయకులు ఇంద్రచంద్, ప్రేమ్‌చంద్, సునీల్, ఆనంద్, నవీన్, సాగర్, కమలేష్, విశాల్, లలిత, ప్రవీణ్, అమిత్ జైన్లు పాల్గొన్నారు.

కఠారి కుటుంబానికి అండగా టీడీపీ: అమర్



మాజీ మంత్రి అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న కఠారి హేమలత

చిత్తూరు, ఫిబ్రవరి 27: మాజీ మేయర్ కఠారి అనురాధ, మోహన్ కుటుంబానికి ఎల్లప్పుడూ టీడీపీ అండగా ఉంటుందన్న విషయాన్ని తెలియజేయాలని పార్టీ అధినేత చంద్రబాబు చెప్పమన్నారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. మంగళవారం మాజీ మేయర్ కఠారి హేమలత, మాజీ కౌన్సిలర్లు కందా, వరదరాజులు, సతీష్, కఠారి లావణ్యలు కలిసి అమరనాథరెడ్డిని పలమనేరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలను చర్చించారు. తొలి నుంచి చంద్రబాబు కఠారి కుటుంబానికి అండగా ఉంటూ వస్తున్నారని, రానున్న రోజుల్లో కూడా వారికి న్యాయం చేస్తానని తన మాటగా చెప్పాలని చంద్రబాబు చెప్పారని అమరనాథరెడ్డి తెలిపారు.

టీడీపీ సీనియర్ నేత చిన్నబ్బ నాయుడు మృతి

- నివాళులర్పించిన పలువురు నేతలు



నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 27: తూగుండ్రం పంచాయతీ ఆరిమాకులపల్లె గ్రామానికి చెందిన మునస్వామి నాయుడు కుమారుడు టీడీపీ సీనియర్ నేత చిన్నబ్బ నాయుడు (75) మృతి చెందారు.. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించారు. భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఆరిమాకులపల్లెకు తీసుకువచ్చారు. మంగళవారం పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి, తూగుండ్రం మాజీ సర్పంచ్ ఎస్.హెచ్.నియాజ్ అలీ వీరిలో ఉన్నారు.

జీజేఎంకు మహిళల అభినందనలు

గుడిపాల, ఫిబ్రవరి 27: మండలంలోని బసవాపల్లె పంచాయతీ కోలావూరు మహిళలు చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాల జగన్మోహన్ నాయుడును అధిష్ఠానం ప్రకటించడంతో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో గ్రామస్తులు ఒకేమాటపై ఉండి తనను ఆదరించాలని, విజయం సాధించాక గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని జగన్మోహన్ తెలిపారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఉదయ, మహిళలు పాల్గొన్నారు.



జీజేఎంను కలిసిన కోలావూరు మహిళలు

అందుబాటులో లేని డాక్టర్లు

- అవస్థల్లో రోగులు

కార్వేటినగరం, ఫిబ్రవరి 27: కార్వేటినగరం ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో అత్యవసర చికిత్స చేయడానికి కూడా వైద్యులు అందుబాటులో ఉండటం లేదని వారు తెలిపారు. ఉన్నతాధికారులు సైతం ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. కనీసం అత్యవసర సమయంలోనైనా వైద్యులు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

పూతలపట్టు, ఫిబ్రవరి 27: మండలంలోని అన్నక్యాంటీన్‌లో మంగళవారం కొట్లపల్లికి చెందిన దివంగత టీడీపీ నేత భార్గవ నాయుడు వర్ధంతి సందర్భంగా సురేష్ భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హిమగిరి నాయుడు, ఊట్ల నాగరాజు నాయుడు, ఏకాంబరం, హరి, వీరభద్రయ్య, యువరాజు నాయుడు, నాగయ్య, దాము తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

- వెయ్యి లీటర్ల సారా ఊట ధ్వంసం



సారా విక్రయిస్తున్న నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

పాలసముద్రం, ఫిబ్రవరి 27: విచ్చలవిడిగా నాటుసారా తయారీ, అమ్మకాలు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం వార్తాకథనం ప్రచురించడంతో ఎస్ఈబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని నరసింహాపురం, అయ్యవారికండ్రిగ గ్రామాల్లో కార్వేటినగరం సీఐ లక్ష్మీదుర్గయ్య ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యవారికండిగలో సారా విక్రయిస్తున్న మట్టారెడ్డిని అరెస్టుచేసి, అతడి వద్ద ఉన్న 20 లీటర్ల సారాను స్వాధీన పరచుకున్నారు. అయ్యవారికండ్రిగ అడవుల్లో తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, అక్కడ నిల్వవుంచిన 50 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే తుమ్మ చెక్కను సైతం ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐలు భారతి, నాగరాజు, హెడ్‌కానిస్టేబుళ్లు రవి, హరి, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 27: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు సూచించారు. మంగళవారం ఎస్ఆర్‌పురం పుల్లూరు గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమ కాటు నుంచి రక్షణకు దోమతెరలు వాడేలా ప్రజలకు ఏఎన్ఎంలు అవగాహన కల్పించాలని సూచించారు. డాక్టర్లు సందీప్, గిరిధర్ రెడ్డి, లక్ష్మీపతి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి

పాలసముద్రం, ఫిబ్రవరి 27: మండలంలోని చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ మోహన్‌కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వైద్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 0-5 సంవత్సరాల వయస్సున్న చిన్నారులు మండలంలో 2767 మంది ఉన్నారని, వీరికి 19 కేంద్రాల్లో పోలియోచుక్కలు వేస్తారన్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. తహసీల్దార్ జయలక్ష్మి, ఏవో విద్యావతి, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

అపోలో వైద్య కళాశాలలో
నీతి శాస్త్రంపై అవగాహన



విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 27: నగరంలోని అపోలో వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు మంగళవారం నీతి శాస్త్రంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్‌వీకే ప్రసాద్ రెడ్డి వైద్య వృత్తిలో పాటించాల్సిన నియమ, నిబంధనలను, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం అపోలో డీన్ ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో వైద్యుల మీద దాడులు పెరుగుతున్న తరుణంలో వైద్యులు పాటించాల్సిన నియమావళి గురించి వివరించారు. పీజీ, ఎంబీబీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, ఫిబ్రవరి 27: రామకుప్పం మండలం బల్ల గ్రామంకు చెందిన టీడీపీ కార్యకర్త మురుగప్ప అనే వ్యక్తి రెండు నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతని కుటుంబానికి టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా రూ.2లక్షలు ఆర్థికసాయాన్ని మంగళవారం స్థానిక టీడీపీ నేతలు ఎర్రప్ప, శ్రీనివాసులు, శంకర్, మునిరత్నం, చంద్రశేఖర్, మురుగేష్, హనుమంతులు అందజేశారు.

వరకట్నం కేసు నమోదు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి27: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పుంగనూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ నాగరాజ కథనం మేరకు.. మండలంలోని నేతిగుట్టపల్లెకు చెందిన రెడ్డిరాణి(26)కి సోమల మండలం కందూరుకు చెందిన వెంకటరమణతో 2021లో వివాహమైంది. కొద్దిరోజులుగా భర్త మద్యానికి బానిసయ్యాడు. పుట్టింటినుంచి డబ్బు తీసుకురావాలని రోజూ భార్యను వేధించేవాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా: గురజాల

- టికెట్ ఎవరికిచ్చినా కలసి పనిచేస్తామని ముందే చెప్పాం
- మా మధ్య విభేదాలు లేవు.. సోషల్ మీడియా వదంతులు నమ్మవద్దు
- టికెట్ ఆశించిన టీడీపీ నేతల ప్రెస్‌మీట్



సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 27: 'నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించండి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా'నని చిత్తూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. చిత్తూరు అభ్యర్థిని అధిష్ఠానం ప్రకటించిన తర్వాత టీడీపీ నాయకులు తొలిసారి మంగళవారం జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. తొలుత అభ్యర్థి గురజాల జగన్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినందుకు అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, అచ్చెన్నాయుడుతో పాటు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఎమ్మెల్యేగా గెలుపొంది చంద్రబాబుకు బహుమతిగా ఇస్తానని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీకోసం పనిచేసిన వారిని ఎన్నటికీ విస్మరించనని... అందరినీ కలుపుకుని పోతానని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ నా ఆధ్వర్యంలో చిత్తూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా అందరూ కలసి పనిచేస్తామని ముందుగా మాట్లాడుకున్నారని చెప్పారు. ఆమేరకు పార్టీ గెలుపుకోసం అందరూ కలసి పనిచేస్తామన్నారు. మాజీ మేయర్ కటారి హేమలత, రాష్ట్ర పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి సీఆర్ రాజన్, జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీలు మాట్లాడుతూ చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని కోరారు. పార్టీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ గెలుపునకు అందరం కృషిచేస్తామని చెప్పారు. పార్టీ అధికారంలోకి రావడానికి తాము శాయశక్తులా కృషిచేస్తామన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఆశావహులకు సముచిత స్థానం కల్పిస్తుందని చంద్రబాబు మాటగా చెప్పమన్నారన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని.. చిత్తూరు వైసీపీ అభ్యర్థి రెడ్ శాండిల్ స్మగ్లర్ అని అన్నారు. ఎవరు మంచివారో, ఎవరి వల్ల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందో ప్రజలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు నియోజకవర్గ పరిశీలకుడు మునిరామయ్య, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు వసంత్ కుమార్, త్యాగరాజన్, సుబ్రమణ్యం నాయుడు, హేమాద్రి నాయుడు, కాజూరు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయ ఢంకా పూతలపట్టు నుంచే ఆరంభం కావాలి

- సోషల్ మీడియా వదంతులను నమ్మకండి - ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి


చిత్తూరు సిటీ/పూతలపట్టు, ఫిబ్రవరి 27: తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కలసికట్టుగా సైనికుల్లా పనిచేయాలని, టీడీపీ గెలుపు పూతలపట్టు నుంచే ఆరంభం కావాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. పూతలపట్టు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం చిత్తూరులోని భాస్కర హోటల్‌లో ఇన్‌చార్జి మురళీమోహన్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జోన్-4 ఇన్‌చార్జి ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండల నాయకులు, కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూసుకుంటూ పార్టీ గెలుపునకు నడుం బిగించాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్ పనితీరు చాలా బాగుందని కొనియాడారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని అన్నారు. 175 స్థానాలకు 175 స్థానాలు టీడీపీ, జనసేన కూటమి గెలవడం ఖాయమన్నారు. అనంతరం ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యువరాజులు నాయుడు, రాష్ట్ర కార్యదర్శి సప్తగిరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, అధికార ప్రతినిధి గంగారపు గోపి, పూతలపట్టు, బంగారుపాళ్యం, తవణంపల్లి, యాదమరి, ఐరాల మండల కన్వీనర్లు దొరబాబు చౌదరి, ఎన్‌పీ జయప్రకాష్, గాలి దిలీప్‌కుమార్, మొర్తార్జీ యాదవ్, గిరిధర్ బాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మాజీ జడ్పీటీసీలు, నియోజకవర్గానికి చెందిన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో మంగళవారం రామానుజర్ ఆలయ దర్శనానికి వచ్చిన టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌తో నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు పులివర్తి నాని, లోకేశ్‌కి పుష్పగుచ్ఛమిస్తున్న గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వేపంజేరి మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ

ఈ-పాస్ బుక్ ఇచ్చినా చెల్లదట..!

- సర్వేయర్ స్కెచ్‌ను మార్చుతున్నారు
- ఆన్‌లైన్‌లో ఉన్నదాన్ని ఎలా తొలగిస్తారని బాధితురాలి ఆవేదన



మాట్లాడుతున్న కుమారి, ప్రభుత్వం జారీ చేసిన ఈ-ఫాస్ బుక్

గుడిపాల, ఫిబ్రవరి 27: అనుభవంలో ఉన్న భూమికి ప్రభుత్వమే ఈ-పాస్ బుక్ పంపిణీ చేసి ఇప్పుడు ఆ బుక్ చెల్లదని సర్వేయర్ చెప్పడం విడ్డూరంగా ఉందని నారగల్లు గ్రామానికి చెందిన కుమారి ఆవేదనను వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2007లో సర్వే నెంబరు 500-1బిలో 0.83 ఎకరాల భూమి తన పేరుమీద ఉందన్నారు. దీనికి సంబంధించిన పాస్‌బుక్‌ను కూడా ఇచ్చారు. 2015లో ఆన్‌లైన్ చేసి 1బి, ఈ-పాస్ బుక్ ఇచ్చిన తరువాత భూమిపై బ్యాంకు రుణం పొందామన్నారు. అనంతరం బోరు కూడా వేసుకున్నామన్నారు. అయితే ఇటీవల సర్వేయర్ కిరణ్ 1979లో వేసిన స్కెచ్‌ను మార్చివేసి ప్రభుత్వ భూమిగా చెబుతున్నారని కుమారి తెలిపారు. అదేవిధంగా 197 రామాపురంలో కూడా తగాదాలు పెట్టారని వాపోయారు. ఈ భూమి తప్ప ఇతర ఆదామేమి లేదని, తన భూమి తనకు చెందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కుమారి కోరారు.

అక్రమ కేసులకు వ్యతిరేకంగా నిరసన



ఎన్జీవో భవనం వద్ద నిరసన తెలుపుతున్న సంఘ నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 27: ఇచ్చిన హామీలను నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన తెలిపిన ఎన్జీవో సంఘ నేతలపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేయడంపై మంగళవారం సాయంత్రం ఎన్జీవో సంఘ కార్యాలయం వద్ద ఆ సంఘ నేతలు నిరసన తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు విడతల వారీగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించామని, ఈ నిరసనలో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేయడం సరికాదని ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు అన్నారు. నిరసనల ఫలితంగా నాల్గో తరగతి ఉద్యోగులకు జీపీఎఫ్ ఎను మంజూరు చేశారన్నారు. అనంతరం మంత్రుల సమావేశానికి సంఘ నేతలను చర్చలకు ఆహ్వానించి పీఆర్సీ, డీఏ బకాయిలు, సరెండరు లీవులు తదితర వాటిని ఈ నెల 31వ తేదీలోపు పరిష్కరిస్తామని మంత్రులు చెప్పడంతో ఛలో విజయవాడ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించిన న్యాయం చేయకపోతే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ వీజీ రఘు, నేతలు ప్రదీప్, భానుప్రకాష్, బాలసుబ్రహ్మణ్యం, మురళి, మురుగేశ్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయడంపై
అవగాహన కల్పిస్తాం: కమిషనర్



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, ఫిబ్రవరి 27: వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేయడంపై పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వడంతో పాటు అవగాహన కల్పిస్తామని, వ్యర్థాల నిర్వహణలో ఈ ప్రక్రియ ఎంతో కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ చెప్పారు. మంగళవారం ఆమె నగరపాలక కార్యాలయం వద్ద కార్మికులతో మాట్లాడారు. వ్యర్థాల సెగ్రిగేషన్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్మికులు వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని, ఇందుకోసం దశలవారీగా శిక్షణ ఇస్తామన్నారు. వ్యర్థాలను సేకరించే స్థలంలోనే తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. వ్యర్థాలను తడి, పొడిగా సేకరించడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయన్నారు. అనంతరం కమిషనర్ వాహనాల షెడ్డులోనూ క్లాస్ వాహనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, డీఈ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహా, ఏఈలు పాల్గొన్నారు.

నేడు హైస్కూల్ వార్షికోత్సవం

కార్వేటినగరం, ఫిబ్రవరి 27: కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్ 77వ వార్షికోత్సవం బుధవారం జరుగుతుందని హెచ్ఎం కోటేశ్వరరావు తెలిపారు. పాఠశాల కమిటీసభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాలని ఆయన కోరారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి



కేసులపై విచారిస్తున్న జిల్లా జడ్జి కరుణకుమార్

గుడిపాల, ఫిబ్రవరి 27: లోక్ అదాలత్‌పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కరుణకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పోలీసు స్టేషన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. మండల పరిధిలో నమోదైన కేసులపై ఆరా తీశారు. జాతీయ లోక్ అదాలత్‌లో సులభతరంగా కేసులు పరిష్కరించుకునే దిశగా ప్రజలు చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

గిరిజనులు హక్కుల గురించి తెలుసుకోవాలి

గుడిపాల, ఫిబ్రవరి 27: గిరిజనులు తమ హక్కులను తెలుసుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కరుణకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గట్రాళ్లమిట్టలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన గిరిజనుల హక్కులు, స్కిల్ సెల్ అనీమియాపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్రాళ్లమిట్ట గ్రామాభివృద్ధికి తోడ్పడతామన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాను అందిస్తుందన్నారు. అనంతరం స్కిల్‌సెల్ అనీమియా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్ఐ రామ్మోహన్, ఎంపీడీవో రాజశేఖర్, ఎంఈవో గణపతి, ఎస్టీ నాయకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీజేపీ ప్రజాపోరు



అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీజేపీ ప్రజాపోరు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 27: బీజేపీ తలపెట్టిన ప్రజాపోరు కార్యక్రమం మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాబు, మోహన్, చిట్టిబాబు, షణ్ముగం, వేణుగోపాల్, రామభద్ర, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: బీజేపీ ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఆముదాల బాలక్రిష్ణాపురం పంచాయతీల్లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జాగర్లమూడి చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించి, రాబోవు ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ఓడించి, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, నాయకులు వెంకటేశులు, బాలయ్య, మురగదాస్, చెంగమ నాయుడు, మురళీ రాజు తదితరులు పాల్గొన్నారు.

నగరి: నగరి పట్టణ పరిధిలోని నగరిపేట, చింతలపట్టెడ, ఏకాంబరకుప్పం, సత్రవాడ, పుదుపేట, నగరి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీనియర్ నాయకులు రామ్మూర్తి యాదవ్ తెలిపారు. ఇంటింటికి వెళ్లి బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు మునికృష్ణమ నాయుడు, రామ్మూర్తియాదవ్, మోహన్, శేఖర్, శ్రీనివాసన్, వేలాయుధం, మణివన్నన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించాలి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 27: రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి కొనేరు చెంగల్రాయరెడ్డి కోరారు. మంగళవారం వెదురుకుప్పం మండలం కొమరగుంట గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. గ్రామ కమిటీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునికృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, హేమశేఖర్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.